మున్నూరు కాపులకు నిధులెప్పుడిస్తరు?

మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య

వేములవాడ, అక్టోబర్ 1: 'మున్నూరు కాపులకు నిధులెప్పుడిస్తరు? కార్పొరేషన్‌కు కమిటీని ఎప్పుడు ఏర్పాటు చేస్తరు?' అని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని మున్నూరు కాపు నిత్యాన్నదాన సత్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాపు కార్పొరేషన్ ఏర్పాటు అంశాన్ని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టినందుకే రాష్ట్రంలోని 50 లక్షల మంది కాపులు కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలికారని గుర్తుచేశారు. వంద రోజుల్లోనే కాపు కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయమైనప్పటికీ.. కమిటీని ఎప్పుడు నిర్ణయిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్‌కు రూ.3 వేల కోట్లు ఇవ్వాలని నిరసన తెలిపినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కోకాపేటలో రూ. 500 కోట్ల విలువైన భూమి ఇవ్వగా, ప్రభుత్వం ఇచ్చే రూ.50 కోట్లు సరిపోవని అన్నారు.

కేయూలో విజిలెన్స్ దాడులు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 1: కాకతీయ యూనివర్సిటీలో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీ బాలుకోటి, సీఐ రాకేశ్, ఇతర విజిలెన్స్ అధికారుల బృందం కేయూ పాలన భవనంలో విచారణ చేపట్టారు. మాజీ వీసీ తాటికొండ రమేశ్ అక్రమాలపై అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ బాధ్యులు ప్రభుత్వానికి, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వం స్పందించి విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. మాజీ వీసీ రమేశ్ అక్రమాలపై అడిగిన సమాచారం పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడంతో విజిలెన్స్ అధికారులు స్వయంగా యూనివర్సిటీకే వచ్చారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పెరటి మల్లారెడ్డి అందుబాటులో లేకపోవడంతో ప్రస్తుత ఇన్‌చార్జి రిజిస్ట్రార్, కంట్రోలర్ నరసింహాచారి, వర్సిటీ ఆడిట్, స్టేట్ లోకల్ ఆడిట్ వారి ఫైళ్లను పరిశీలించారు.

హోంగార్డులంటే అంత చులకనా?

- సర్కారు కూల్చివేతల్లో గాయపడితే పట్టించుకోరా?
- హోంగార్డు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి
- ఏఐజీ దవాఖానలో గోపాల్‌కు హరీశ్‌రావు పరామర్శ

గచ్చిబౌలి ఏఐజీలో చికిత్స పొందుతున్న హోంగార్డు గోపాల్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, చింతా ప్రభాకర్. చిత్రంలో ఎర్రోళ్ల శ్రీనివాస్, పెద్ది సుదర్శన్‌రెడ్డి తదితరులు

సంగారెడ్డి, అక్టోబర్ 1(నమస్తే తెలంగాణ): హోంగార్డులంటే ప్రభుత్వానికి, పోలీసు ఉన్నతాధికారులకు చులకనగా ఉందా? అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని ఏఐజీ దవాఖానలో చికిత్స పొందుతున్న సంగారెడ్డికి చెందిన హోంగార్డు గోపాల్‌ను మంగళవారం మాజీ మంత్రి హరీశ్‌రావు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా కంది మండలం ఇంద్రకరణ్ పోలీస్టేషన్ హోంగార్డు గోపాల్.. ఇటీవల మల్కాపూర్ పెద్ద చెరువులో అక్రమ నిర్మాణాన్ని కూల్చేస్తుండగా శిథిలాలు తగిలి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారని తెలిపారు. గోపాల్‌ను ఒక్క ఉన్నతాధికారి కూడా పరామర్శించలేదని తెలిపారు. గోపాల్ కోలుకునే వరకు వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించాలని, 4 నెలల వేతనాలు విడుదల చేయాలని కోరారు. ఇంకా మాజీ ఎమ్మెల్యేలు పెద్దరెడ్డి సుదర్శన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఉన్నారు.

కారు బోల్తా.. ఐదుగురి దుర్మరణం

- మృతులంతా ఒకే కుటుంబం వారు
- ఆదిలాబాద్ జిల్లాలో ఘోర ప్రమాదం

ఆదిలాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ జిల్లాలో సోమవారం అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు దుర్మరణం చెందారు. ఆదిలాబాద్ టీచర్స్ కాలనీకి చెందిన మొహిజొద్దీన్ తన మ్యాక్స్ వాహనంలో కుటుంబ సభ్యులతో కలిసి నిర్మల్ జిల్లా భైంసాకు వెళ్లివస్తున్నాడు. గుడిహత్నూర్ మండలం మేకలగండి వద్ద వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మొహిజొద్దీన్ (65), ఆయన అల్లుడు ఖాజా మొయినొద్దీన్ (40), మనుమలు ఉస్మాన్‌నొద్దీన్ (11), ఫరొద్దీన్ (12), మహమ్మద్ అలీ (8) మృతి చెందగా.. కారులో ప్రయాణిస్తున్న ఆయేషా, ఏక్రాలు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు.

ఖమ్మం జిల్లాలో ముగ్గురు

కారేపల్లి, అక్టోబర్ 1: ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం భాగ్యనగర్‌తండా వద్ద మంగళవారం రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురు మృతి చెందారు. గుట్టకిందగుంపునకు చెందిన ఉండం సూర్యనారాయణ (45), సుగుణ (42) దంపతులు బైక్‌పై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందుకు వెళ్లి వస్తున్నారు. ఓపెన్‌కాస్ట్ సమీపంలోని సోలార్ పవర్‌ప్లాంట్‌లో ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న నక్క వెంకటేశ్(35), ఆలియాతండాకు చెందిన ధరావత్ రాజు కారేపల్లి నుంచి పవర్‌ప్లాంట్ వైపు బైక్‌పై వెళ్తుండగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. సూర్యనారాయణ, సుగుణ, వెంకటేశ్ అక్కడికక్కడే మృతిచెందారు. రాజుకు తీవ్రగాయాలు కావడంతో ఇల్లెందు దవాఖానకు తరలించారు.

- తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని నిరసిస్తూ సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం బిర్శించర్ల గ్రామంలో మంగళవారం మహిళలు ఖాళీ బిందెలతో రాస్తారోకో చేశారు. పదోవార్డు వాసులు మాట్లాడుతూ మోటర్ కాలిపోవడంతో నీళ్లు రాక అవస్థలు పడుతున్నామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రమాదేవి హామీతో ఆందోళన విరమించారు. – నేరేడుచర్ల

- గుండూరు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థుల ధర్నా

పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం గుండూరు జెడ్పీహెచ్ఎస్ ఎదుట మంగళవారం విద్యార్థులు, తల్లిదండ్రులు ధర్నా చేపట్టారు. పాఠశాలలో మూత్రశాలలు నిర్మించినా.. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వాటిని వినియోగించుకోలేకపోతున్నామని తెలిపారు. మూత్రవిసర్జన కోసం బహిరంగ ప్రదేశాలకు వెళ్లలేక అవస్థలు పడుతున్నట్టు చెప్పారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టకుండా స్థానిక ప్రజాప్రతినిధులు – కల్వకుర్తి రూరల్

- మూడ్రోజుల తర్వాత మళ్లీ మార్కింగ్

ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ చెరువు పరిసరాల్లో మూడ్రోజుల తర్వాత మంగళవారం అధికారులు మళ్లీ సర్వే చేయడానికి రావడంతో స్థానికులు వారిని అడ్డుకున్నారు. దీంతో అధికారులు చేసేదేమీ లేక వెనుదిరిగారు. – ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ

లడ్డూ వివాదంపై సిట్ దర్యాప్తు నిలిపివేత

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): తిరుమల లడ్డూ కల్తీ వివాదంపై సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం మంగళవారం సంచలన నిర్ణయం తీసుకున్నది. సిట్ దర్యాప్తును తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు డీజీపీ ద్వారకా తిరుమలరావు ప్రకటించారు. ప్రభుత్వ తరపు లాయర్ల సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు డీజీపీ స్పష్టం చేశారు.

సాగర్ కాల్వలో ముగ్గురు గల్లంతు

- ఒకరి మృతదేహం లభ్యం
- మరో ఇద్దరి కోసం గాలింపు

రఘునాథపాలెం, అక్టోబర్ 1 : సాగర్ కాల్వలో పడి ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. వీరిలో ఒకరి మృతదేహం లభించగా మిగతా ఇద్దరి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఈ ఘటన ఖమ్మం అర్బన్ పరిధి దానవాయిగూడెం వద్ద మంగళవారం చోటుచేసుకున్నది. భద్రాద్రి జిల్లా మణుగూరు ప్రాంతానికి చెందిన రోండ వెంకటేశ్వర్లు, చల్లా రమేశ్, ప్రసాద్, బండారు భరత్ సోమవారం ఖమ్మం వచ్చారు. మధ్యాహ్నం దానవాయిగూడెంలో మద్యం సేవించారు. తిరిగి వెళ్లే క్రమంలో దానవాయిగూడెం సాగర్ కెనాల్ వద్ద రాత్రి 10 గంటలకు ఆగారు. కెనాల్ పైకి వెళ్లాలని నిర్ణయించుకొన్నారు. రోండ వెంకటేశ్వర్లు ఆటోలోనే నిద్రించగా మిగిలిన ముగ్గురు సాగర్ కెనాల్ కట్టపైకి వెళ్లారు. అక్కడ స్నానం చేసే క్రమంలో ప్రమాదవశాత్తు గల్లంతయ్యారు. మంగళవారం ఉదయం ఆటోలో నిద్రించిన వెంకటేశ్వర్లు లేచి చూసేసరికి మిత్రులు రాకపోవడంతో కెనాల్ వైపు వెళ్లాడు. అక్కడ తన మిత్రుల దుస్తులు కాల్వ గట్టుపై కనిపించాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కాల్వలో గాలింపు చర్యలు చేపట్టగా బండారు భరత్(30) మృతదేహాన్ని గుర్తించారు. మరో ఇద్దరు ఆచూకీ కోసం రాత్రి వరకు గాలించినప్పటికీ ఫలితం లేకపోయింది.

బాలికపై వృద్ధుడి లైంగిక దాడి

- కొంతకాలంగా అఘాయిత్యం
- 4 నెలల గర్భిణిగా తేల్చిన వైద్యులు

గీసుగొండ, అక్టోబర్ 1: వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(12)పై అదే గ్రామానికి చెందిన వృద్ధుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఓ ప్రభుత్వ పాఠశాలలో బాలిక 8వ తరగతి చదువుతున్నది. ఆమెకు తండ్రి లేడు. అదే గ్రామానికి చెందిన చాపర్తి సాంబయ్య (65) బాలికకు మాయమాటలు చెప్పి కొంతకాలంగా లైంగిక దాడికి పాల్పడుతున్నాడు. బాలిక ఆరోగ్య పరిస్థితిని గమనించిన తల్లి నిలదీయగా విషయం చెప్పింది. మంగళవారం గీసుగొండ పోలీస్‌స్టేషన్‌లో తల్లి ఫిర్యాదు చేయడంతో పోలీసులు బాలికకు వైద్య పరీక్షలు చేయించారు. బాలిక 4 నెలల గర్భిణిగా నిర్ధారించారు. సాంబయ్యపై పోక్సో కేసు నమోదైంది.

ఒక్కొక్కరికి మూడు ఉద్యోగాలు

సత్తాచాటిన నాగర్‌కర్నూల్ జిల్లావాసులు

చారకొండ/అమ్రాబాద్, అక్టోబర్ 1 : నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ఓ ఇద్దరు యువకులు ఏకంగా మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. చారకొండ మండల కేంద్రానికి చెందిన పేద కుటుంబం దొడ్ల కళమ్మ, శేఖర్‌రెడ్డి దంపతుల పెద్ద కుమారుడు నరేశ్ రెడ్డి ప్రభుత్వం నిర్వహించిన పోటీ పరీక్షల్లో మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. హైదరాబాద్‌లో పార్ట్‌టైం ఉద్యోగం చేస్తూ ఎలాంటి కోచింగ్ తీసుకోకుండా పట్టుదలతో చదివి పోటీ పరీక్షలు రాయగా.. ఇటీవల హెచ్‌డబ్ల్యూవో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. కాగా సోమవారం విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీగా, సాంఘిక శాస్త్రంలో స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాడు.

చంద్రశేఖర్

నరేశ్‌రెడ్డి

మాచారానికి చెందిన చంద్రశేఖర్..

అమ్రాబాద్ మండలం మాచారానికి చెందిన చంద్రశేఖర్ డీఎస్సీ ఫలితాల్లో మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. జిల్లా స్థాయిలో స్కూల్ అసిస్టెంట్‌కు సాంఘిక శాస్త్రంలో 8వ ర్యాంక్, ఎస్జీటీలో 15వ ర్యాంక్, భాషా పండిత్ తెలుగులో 3వ ర్యాంక్ సాధించాడు.

మద్యం తాగించి యువతిపై గ్యాంగ్‌రేప్

భూపాలపల్లిలో ఆలస్యంగా వెలుగులోకి

గిర్మాజీపేట, అక్టోబర్ 1: మద్యం తాగించి యువతిపై ఇద్దరు యువకులు సామూహికంగా లైంగిక దాడికి పాల్పడ్డారు. గత నెల 15న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భూపాలపల్లి ప్రాంతానికి చెందిన యువతికి ఓ యువకుడు పరిచయం అయ్యాడు. ఇద్దరి మధ్య చాటింగ్, ఫోన్‌లో మాట్లాడుకోవడంతో పరిచయం మరింత బలపడింది. యువకుడు తన ఇద్దరు మిత్రులతో కలిసి గత నెల 15న యువతిని నమ్మించి కారులో వరంగల్ నగరానికి తీసుకొచ్చాడు. హోటల్‌లో రూమ్ అద్దెకు తీసుకొని యువతికి బీర్లు తాగించి ఇద్దరూ లైంగికదాడికి పాల్పడ్డారు. యువతి ఫిర్యాదు మేరకు మంగళవారం ఇంతెజార్‌గంజ్ పీఎస్‌లో కేసు నమోదైంది.

పేదల జోలికొస్తే ఊరుకోం:కూనంనేని

సుబేదారి, అక్టోబర్ 1: హైడ్రా పేరుతో హైదరాబాద్‌లో పేదల ఇండ్లను కూల్చితే ఊరుకునేది లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసిందన్నారు.

కల్తీ విత్తనాలు అమ్మితే చర్యలు

జగిత్యాల రూరల్, అక్టోబర్ 1: జిల్లాలో కల్తీ విత్తనాలు, ఎరువులను అమ్మితే చట్ట పరమైన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారి బీ వాణి హెచ్చరించారు. మంగళవారం పొలాస, సోమన్‌పెల్లి, కల్లెడ, చలిగల్ గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి వివరాలు తెలుసుకున్నారు. దుకాణాల లైసెన్స్‌లు, విత్తనాలు, క్రిమి సంహారక మందులను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం షాపులను నడిపించాలని సూచించారు. ఆయా గ్రామాల్లో పంటలను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. సోమన్‌పెల్లిలో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి రుణమాఫీపై సందేహాలను తీర్చారు. కార్యక్రమాల్లో ఏఈఓలు హరీశ్, రమ్య, వరుణ్, రవళి, రైతులు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

జగిత్యాల రూరల్, అక్టోబర్ 1: ఎలాంటి షరతులు లేకుండా అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు శేర్ నర్సారెడ్డి డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని హామీనిచ్చి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, కొందరికే అమలు చేసిందన్నారు. మిగిలిన రైతులందరికీ రుణమాఫీ చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. మాఫీకి రేషన్ కార్డుతో లింకు పెట్టవద్దని డిమాండ్ చేశారు. కొత్త రుణాల విషయంలో బ్యాంకర్లు రైతులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. వెంటనే బ్యాంకు అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వానికి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ఒకే బస్సులో 150 మంది

- సొమ్మసిల్లి పడిపోయిన ఇద్దరు యువతులు
- జగిత్యాలలో ఘటన

జగిత్యాల బస్టాండ్‌లో అప్పటికే ప్రయాణికులతో నిండిన బస్సులో ఎక్కేందుకు పోటీ పడుతున్న మరికొందరు

జగిత్యాల, అక్టోబర్ 1: జగిత్యాల నుంచి దావన్‌పెల్లి గ్రామానికి వెళ్తున్న చివరి ఆర్టీసీ బస్సులో సుమారు 150 మంది వరకు ఎక్కడంతో ఊపిరాడక ఇద్దరు యువతులు సొమ్మసిల్లి పడిపోయారు. బుధవారం నుంచి బతుకమ్మ, దసరా సెలవులు కావడంతో జగిత్యాల బస్టాండ్‌కు పెద్ద సంఖ్యలో ప్రయాణికులు తరలివచ్చారు. జగిత్యాల కొత్త బస్టాండ్ నుంచి రాయికల్ మండలం వయా ఆలూరు, రంగపేట, విరాపూర్ మీదుగా దావన్‌పెల్లికి వెళ్లే బస్సు మంగళవారం రాత్రి బయలు దేరగా సుమారు 150 మంది ప్రయాణికులు ఎక్కారు. ఆఖరి బస్సు కావడంతో బస్సు ఎక్కేందుకు పోటీ పడ్డారు. దీంతో బస్సులోని ఇద్దరు యువతులు గాలి ఆడక స్పృహతప్పి పడిపోయారు. వారిని తోటి ప్రయాణికులు ప్రాథమిక వైద్యం కోసం స్థానిక దవాఖానకు తరలించారు.

పోసానిపేట యువకుడికి నాలుగు ఉద్యోగాలు

కే విజయ్

కథలాపూర్, అక్టోబర్ 1 : పోసానిపేట గ్రామానికి చెందిన యువకుడు కుందారపు విజయ్ నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికై ఆదర్శంగా నిలిచాడు. ఎమ్మెస్సీ (మాథ్స్), బీఈడీ పూర్తి చేసిన విజయ్ 2023-24 సంవత్సరంలో గురుకులం టీచర్ పోస్టులకు సంబంధించిన పరీక్షలకు హాజరయ్యారు. అందులో టీజీటీ, పీజీటీ, జేఎల్ (మాథ్స్) పోస్టులకు ఎంపికయ్యాడు. ప్రస్తుతం జగిత్యాల గురుకుల కాలేజీలో జేఎల్(మాథ్స్) ఉద్యోగంలో చేరాడు. తాజాగా డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్(మాథ్స్)లో జిల్లా స్థాయిలో ఐదో ర్యాంకు సాధించాడు.

ప్రజల ప్రాణాలు పోతున్నా పట్టదా..?

మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతసురేశ్

- జిల్లాలో విష జ్వరాలు విజృంభిస్తున్నయి
- అల్లీపూర్‌లో చిన్నారి మృతి కలిచివేసింది
- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల అర్బన్, అక్టోబర్ 1: విషజ్వరాలు విజృంభిస్తూ ప్రజల ప్రాణాలు పోతున్నా ప్రభుత్వం, అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ మండిపడ్డారు. మంగళవారం జగిత్యాలలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ తొమ్మిది నెలల పాలన అస్తవ్యస్తంగా మారిందన్నారు. ఓట్లేసి గెలిపించిన పాపానికి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని దుయ్యబట్టారు. జిల్లాలో విషజ్వరాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, డెంగ్యూ పాజిటివ్ కేసులు నమోదువుతున్నా నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. రాయికల్ మండలం అల్లీపూర్‌లో పదకొండేళ్ల చిన్నారి జ్వరంతో బాధపడుతూ మృతిచెందడం బాధాకరమన్నారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయకున్నా కనీసం ప్రజల ప్రాణాలకైనా గ్యారెంటీ ఇవ్వాలని, పల్లె, పట్టణాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరిచి, అవసరమైన చోట మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. పల్లెల దుస్థితిపై సమీక్ష చేయాలని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కకు విజ్ఞప్తి చేశారు. రుణమాఫీకి మంగళం పాడారని, వానకాలం సీజన్ ముగుస్తున్నా రైతు భరోసా ఎందుకు ఇవ్వలేదో ప్రభుత్వం చెప్పాలన్నారు. ఇక్కడ జగిత్యాల పట్టణ అధ్యక్షుడు గట్టు సతీశ్, అర్బన్ మండల అధ్యక్షుడు తుమ్మ గంగాధర్, మాజీ జడ్పీటీసీ మహేశ్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆనందరావు, ఉపాధ్యక్షుడు వొల్లేం మల్లేశం, మాజీ ఏఎంసీ చైర్మన్ శీలం ప్రియాంక ప్రవీణ్, సమన్వయ కమిటీ సభ్యులు పడిగెల గంగారెడ్డి, ఆనందరావు, కౌన్సిలర్లు సమిండ్ల వాణిశ్రీనివాస్, శ్రీధర్ రెడ్డి, మహేశ్, నాయకులు సంగెపు ముత్తు, సన్నిత్ రావు, సదానందం, చందు, ప్రణయ్, ప్రతాప్, అనిల్, భగవాన్ రాజ్, స్పందన, మల్లేశం, వేణు, నాగరాజు పాల్గొన్నారు.

అక్కాచెల్లెల్లకు డాక్టరేట్ పట్టాలు

- తెలుగు సాహిత్యంలో పరిశోధనలు

తండ్రి వేముల శ్రీనివాస్‌తో డాక్టరేట్ పట్టాలు చేతపట్టుకొని శరణ్య, హర్షిత

మారుతీనగర్, అక్టోబర్ 1: మెట్‌పల్లి పట్టణంలోని బుక్కవాడకు చెందిన ఇద్దరు అక్కాచెల్లెళ్లకు డాక్టరేట్ పట్టాలు వరించాయి. వివరాల్లోకి వెళితే.. పట్టణానికి చెందిన హోమియో వైద్యులు డాక్టర్ వేముల శ్రీనివాస్-సాయి సుధ కుమార్తెలు శరణ్య, హర్షిత తెలుగు సాహిత్యంలో చేసిన పరిశోధనలు చేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలీ గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో నిర్వహించిన 24వ స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అక్కాచెల్లెల్లకు డాక్టరేట్ పట్టాలను అందజేశారు. కాగా, వీరిద్దరూ తెలుగు సాహిత్యంలోని విమర్శ రంగంలో ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో పరిశోధనను పూర్తి చేశారు. శరణ్య ప్రస్తుతం ఆర్మూర్ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల లెక్చరర్‌గా పనిచేస్తుండగా, హర్షిత హైదరాబాద్ శామీర్‌పేటలో సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకురాలిగా చేస్తున్నారు.

నేడు ఉమ్మడి జిల్లా బాక్సింగ్ సెలెక్షన్స్

జగిత్యాల టౌన్, అక్టోబర్ 1 : కరీంనగర్ జిల్లా కేంద్రంలో కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలకు చెందిన బాక్సింగ్ క్రీడాకారుల సెలెక్షన్స్ బుధవారం జరగనున్నట్లు బాక్సింగ్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి జీ శ్రీనివాస్, కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్ ఒక ప్రకటనలో తెలిపారు. అంబేద్కర్ స్టేడియంలో ఉదయం 8 గంటలకు జూనియర్, సబ్ జూనియర్ సెలెక్షన్స్ జరగనున్న నేపథ్యంలో జూనియర్ సెలెక్షన్స్‌కు 2008 జనవరి 1 నుంచి 2009 డిసెంబర్ 31 మధ్య తేదీల్లో, సబ్ జూనియర్ సెలెక్షన్స్‌కు 2010 జనవరి 1 నుంచి 2011 డిసెంబర్ 31 మధ్య తేదీల్లో జన్మించిన బాక్సింగ్ క్రీడాకారులు డేట్ ఆఫ్ బర్త్, పాఠశాలలో బోనాఫైడ్, ఆధార్‌కార్డ్‌తో హాజరు కావాలని, వివరాలకు 9441773080 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కుటుంబ వ్యవస్థ ఎంతో గొప్పది

- వయోవృద్ధుల దినోత్సవంలో జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు

జగిత్యాల, అక్టోబర్ 1: మన దేశంలో కుటుంబ వ్యవస్థ ఎంతో గొప్పదని జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించగా, ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం పలు రంగాల్లో సేవలందిస్తున్న పలువురు వృద్ధులను సన్మానించారు. ఇక్కడ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్, జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, అదనపు జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారి నరేశ్ వయోవృద్ధులు పాల్గొన్నారు.

వృద్ధులను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

'రైతు రణభేరి'ని విజయవంతం చేయాలి

మానాలలో రైతు ఐక్యవేదిక నాయకుడు, రైతులు

మల్యాల, అక్టోబర్ 1: రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 4న జగిత్యాల కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన రైతు రణభేరి ధర్నాను విజయవంతం చేయాలని జగిత్యాల జిల్లా రైతు ఐక్యవేదిక నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి, పోతారం సహకార సంఘ అధ్యక్షుడు అయిల్నేని సాగర్‌రావు కోరారు. మంగళవారం మానాలలో మల్యాల, ముత్యంపేట, తాటిపల్లి, లంబాడిపల్లి, మానాల రైతులతో ప్రత్యేకంగా సమావేశమై, మాట్లాడారు. అర్హులైన రైతులు అందరికీ షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ, వానాకాలం పంటకు సంబంధించిన రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేల చొప్పున అందజేయాలని, అన్ని రకాల వడ్లకు మద్దతు ధరపై క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందజేయాలని కోరుతూ రైతుల తరపున ధర్నా చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో రైతులు నేరెళ్ళ భూమరెడ్డి, బందెల మల్లయ్య, ఆదిరెడ్డి, నర్సింహారెడ్డి, రాజన్న, ఎడిపల్లి రమేష్, ఎడిపల్లి మునీంధర్, తిరుపతి పాల్గొన్నారు.

పోలీసుల ఔదార్యం

- రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కానిస్టేబుల్ కుటుంబానికి అండ
- ₹2.34 లక్షల సేకరణ
- కుమారుడి పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్

మల్యాల, అక్టోబర్ 1: మల్యాల ఠాణాలో పనిచేస్తూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మహిళా కానిస్టేబుల్ వేదశ్రీ కుటుంబానికి తోటి సిబ్బంది అండగా నిలిచారు. మల్యాల సర్కిల్ పోలీసులతోపాటు జిల్లా వ్యాప్తంగా మహిళా కానిస్టేబుళ్లు కలిసి ₹2.34లక్షలు పోగు చేసుకొని మంగళవారం వేదశ్రీ కొడుకు అకుల్ విద్యారామన్ పేరిట పోస్టాఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఈ మేరకు డిపాజిట్ బాండ్‌ను మల్యాల పోలీస్‌స్టేషన్‌లో వేదశ్రీ తల్లి తంగళ